ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 13 అక్టోబరు 2025

గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
****



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	1,01,180	1,01,180
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	2018.50	1709.63
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.6942)	82,430	82,477

చికెన్ ధరలు | లైవ్ : రూ.139 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



ఒక్కొక్కరు ఒక్కసారి ఎన్నికైతేనే ఆస్తులు కూడ బెట్టుకుంటున్నారు, అలాంటిది రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు మంత్రిగా ఉండి కూడా ఆస్తులు అమ్మి పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడుకున్న గొప్ప వ్యక్తి..

● సీఎం రేవంత్‌రెడ్డి

దామన్న కృషితోనే గోదావరి జలాలు

- ఆస్తులమ్మి పార్టీని కాపాడిన వ్యక్తి దామన్న
- ఆ కుటుంబానికి అండగా ఉంటాం
- ఏ అవకాశమొచ్చినా సర్వోత్తమరెడ్డికి అవకాశమిస్తాం
- దామోదర్‌రెడ్డి సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మోత్కూరు/తుంగతుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దామన్న కృషితోనే ఇక్కడికి గోదావరి జలాలు సాధ్యమయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా జరిగిన సంతాప సభలో పాల్గొని దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, హత్యాయత్నాలు ఎదుర్కొని నిలబడిన ధీశాలి దామోదర్‌రెడ్డి అన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడానికి, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమి కొట్టడానికి పోరాడి గోదావరి జలాలు సాధించారన్నారు. శ్రీరాం సాగర్ జలాలు తీసుకరావాలన్న ఆలోచన వచ్చిందే దామోదర్‌రెడ్డికి అన్నారు. వేలాది ఎకరాల భూమి విక్రయించి, జిల్లా ప్రజల కోసం ఖర్చు చేశారన్నారు. తుంగతుర్తి నియోజవర్గం ఎస్సీగా రిజర్వు కానంత వరకూ ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారని, తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయ్యాక పక్క నియోజకవర్గం సూర్యాపేటకు వెళ్లినా ఈ నియోజకవర్గంలో పార్టీని, కార్యకర్తలను కాపాడటానికి ఎంతో కృషి చేశారన్నారు. 1985 నల్లగొండ జిల్లాలో ఒకే ఒక్కడు దామోదర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి నల్లగొండ జిల్లాలో పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సుజాతనగర్, పాలేరు నియోజవర్గాల నుంచి దామోదర్‌రెడ్డి అన్న వెంకట్‌రెడ్డి గెలిచి అక్కడ పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడారని చెప్పారు. దామోదర్‌రెడ్డి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటన్నారు. ఏ అవకాశమొచ్చినా సర్వోత్తమరెడ్డికి అవకాశమిస్తామన్నారు.

దామన్న కీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది 7



సంతాపసభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

యువతకు స్ఫూర్తిగా నిలిచారు

యువత రాజకీయాల్లోకి రావడానికి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్ఫూర్తిగా నిలిచారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 1985లో నల్లగొండ జిల్లాలో ఎవరూ గెలువలేని సందర్భంగా దామోదర్‌రెడ్డి విజ యం సాధించి పార్టీ జెండాను జిల్లాలో రెపరెపలాడించారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన తుంగతుర్తి నియోజకవర్గంతోపాటు, జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. యువత రాజకీయాల్లోకి రావడానికి ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఎన్నికల ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వెళుతున్నప్పుడు దామోదర్‌రెడ్డి తన వయస్సును కూడా లెక్కచేయకుండా తనవెంట నడిచారన్నారు. దామోదర్‌రెడ్డి ఆశయాలను తమ ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందన్నారు.

అంతరాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న నర్సిరెడ్డి

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): అంతరాలు లేని విద్యా సమాజాన్ని నిర్మించుకోవాలని టీపీఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీపీఎస్‌వీ (తెలంగాణ పౌర స్పందన వేదిక) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ భవనలో ఏర్పాటు చేసిన 'విద్యలో అంతరాలు తొలగిపోయేదెట్లా?' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాధేశ్యామ్ మాట్లాడుతూ విద్యారంగంలో అసమానతలు ఉండడంతో విలువలు పతనమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. టీపీఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో కవులు, రచయితలు సాగర్ల సత్తయ్య, కృష్ణారెడ్డి, మూనాస వెంకట్, పగడాల నాగేందర్, పెరుమాళ్ల ఆనంద్, శ్యాంసుందర్, భూతం ముత్యాలు, బండారు శంకర్, హస్సేన్ పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుపై నీలి నీడలు!

ఆయిల్‌పామ్ సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాగే కొనసాగితే నిర్ణీత వ్యవధిలో లక్ష్యం నెరవేరడం కష్టమేనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. రానున్న రోజుల్లో తెలంగాణను ఆయిల్‌పామ్ హబ్‌గా మార్చి దేశంలోనే రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలపాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణాన్ని విస్తరిం పజేయాలన్న లక్ష్యానికి ఉమ్మడి జిల్లాలో పామాయిల్ కంపెనీలతో ఉద్యానశాఖ అధికారులు నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- నిర్ణీత వ్యవధిలో లక్ష్యం నెరవేరడం కష్టమే
- సహకరించని పామాయిల్ కంపెనీలు
- ఉద్యాన అధికారులు, కంపెనీల మధ్య సమన్వయలోపం
- సాగు విస్తీర్ణం పెరిగితేనే ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం
- మందకొడిగా సాగు విస్తీర్ణంపై మంత్రి తుమ్మల మండిపాటు

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా వచ్చే ఆదాయాన్ని వివరించి తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సి ఉంది. కానీ నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. వాస్తవానికి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సాగు ముందుగా ప్రారంభమైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మాత్రం రెండేళ్ల కిందనే ఈ తోటల సాగు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ కంపెనీల ప్రతినిధులకు ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ఉద్యానశాఖ అధికారులతో కలిసి పనిచేయని పరిస్థితులున్నాయి. మొక్కల పంపిణీ నుంచి మొదలుకొని వాటి పెంపకం వరకు రైతులకు ఉద్యానశాఖ అధికారులతో కలిసి కంపెనీ ప్రతినిధులు, వారి ఉద్యోగులు రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా కూడా కంపెనీల ప్రతినిధులు సాగు చేస్తున్న రైతులను కలిసిన దాఖలాల్లేవు. కంపెనీల ప్రతినిధుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేకుండా పోయింది. ఇక ఉద్యానశాఖ హెచ్‌వోలు సైతం అంటి ముట్టన్నట్లుగా ఉండటంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీనికితోడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎనిమిది మండలాలకు ఒకరి చొప్పున హెచ్‌వోలు ఉండటంతో ఆయిల్ పామ్ సాగు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

ఉమ్మడి జిల్లాలో లక్ష్యం నెరవేరేదెలా

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 20 వేలలోపు ఎకరాలకు మాత్రమే ఆయిల్‌పామ్ సాగు విస్తరించి ఉన్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాలో 10,700 ఎకరాలు సాగు కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 4వేలకు పైగా ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 4,500 ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు తెలిసింది. అయితే నల్లగొండ జిల్లాలో మొత్తం 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం కావాలని, ఇందులో ఈ ఏడాది చివరిలోగా మరో 6,500 ఎకరాల్లో సాగు చేయాలన్నా లక్ష్యాన్ని విధించారు. అంటే ఏడాదిలో జూన్ నాటికి మొత్తంగా 25వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ విస్తరణ అనేది అనుమానమే. అదేవిధంగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో కూడా ఆయిల్‌పామ్ సాగు మందకొడిగా సాగడం గమనార్హం. ఆయిల్‌పామ్ సాగు చేస్తే సంవత్సరానికి వచ్చే ఆదాయాన్ని రైతులకు వివరించడంతోపాటు పలు విధాలుగా వచ్చే లాభాలను రైతులకు తెలియజేస్తే తప్ప ఆయిల్‌పామ్ సాగు తోటల విస్తీర్ణం పెరిగేందుకు అవకాశాలులేవు. సాగు విస్తీర్ణం పెరగడం లేదన్న విషయం తెలిసినప్పటికీ మండలాలవారీగా, గ్రామాల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించే....

- మిగతా 8వ పేజీలో...

ప్రీ ప్రైమరీ బోధన అంతేనా?

● రెండు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని తరగతులు



6

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

● పట్నంబాట పట్టిన ప్రజలు



7

కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

అమరవీరుల ఆశయాలను సాధించాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు వీ.హనుమంతరావు



వల్లాలలో అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న హనుమంతరావు, పక్కన ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ దయాకర్

శాలిగౌరారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో 1948లో జాతీయ జెండా ఎగురవేసిన 10 మంది విద్యార్థులను రజాకారులు కాల్చి చంపారు. అమరవీరుల చరిత్రను తెలుసుకున్న హనుమంతరావు ఆయన సొంత ఖర్చులతో గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అమరవీరుల స్మారకార్థం స్థూపాన్ని నిర్మించారు. స్థూపావిష్కరణ సభలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 10 మంది అమరవీరుల కుటుంబాలకు రూ.5లక్షలను, ఒక్కొక్కరికి రూ.50వేలను ఆదివారం సాయంత్రం హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ అమరవీరులకు గుర్తుగా వల్లాలలో అమరవీరులకు గుర్తుగా అత్యున్నతమైన సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ శాసనసభ్యుడు గోనే ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఇతియాజ్ అహ్మద్, భూపతి వెంకన్న, దండ అశోక్‌రెడ్డి, మాదగోని రామలింగయ్య, నరిగె నరసింహ, నోముల జనార్ధన్, గుండ్లపల్లి సైదులు, వేముల గోపీనాథ్, బోడ అరుణ్ కుమార్, నోముల రవికుమార్, గుండ్లపల్లి శంకర్, నాగరాజు, నరిగె ఆంజనేయులు పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి

6

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



బీసీ రిజర్వేషన్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ 42శాతంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్‌గార్డెన్‌లో జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రాభాయి సంతాపసభలో అయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తుంటే కేంద్రం అమలు కాకుండా అడ్డుకుంటోందన్నారు. రిజర్వేషన్ చట్టబద్దతకోసం రాష్ట్రం సుప్రీం కోర్టులో అప్పీల్ చేయడానికి సిద్ధమవుతోందని, అది సరిపోదని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పతులను భారతదేశానికి దిగుమతి చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల మన వ్యవసాయరంగానికి నష్టం కలుగుతుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం ధాన్యం కోతలు ప్రారంభం కానున్నందున ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వర్‌రావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాశం, కందాల ప్రమీల, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవి నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఏఐ తోడు

- పారదర్శకంగా ఇళ్ల మంజూరు, నిర్మాణాలు
- బిల్లుల చెల్లింపులకు ఏఐ టెక్నాలజీ

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు, బిల్లుల చెల్లింపు వరకూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంత వరకు వినియోగించాలని గృహ నిర్మాణశాఖ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఏఐ ఆధారిత పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకతకోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించే సమయంలో బ్యాంకర్లు చేసిన తప్పిదాలవల్ల ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ఆర్థికసాయం పంపిణీలో గందరగోళం లేకుండా చర్యలు చేపట్టింది. ఆ ఆధార్ నెంబరు ఏ బ్యాంక్ ఖాతాతో అనుసంధానమై ఉందో ఆ బ్యాంకు ఖాతాలోకి ఆటోమెటిక్‌గా నిధులు జమ అవుతాయి. అలా జరిగేలా సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పూర్తి సమచారాన్ని ఆన్‌లైన్ తెలుసుకునేలా ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న వెబ్‌సైట్‌లో పలు మార్పులు చేసింది. లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల పురోగతి, బిల్లుల చెల్లింపుల స్థితిగతులను ఆన్‌లైన్ నేరుగా తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు తరుచూ కార్యాలయాలకు వెళ్లకుండా వెబ్‌సైట్‌లోనే సంబంధిత వివరాలు తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా లబ్ధిదారులు ఇళ్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో పొరపాటు జరిగితే లబ్ధిదారులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారాన్ని అందిస్తున్నారు. తద్వారా వారు బ్యాంకు ఖాతాలు, ఇళ్ల మంజూరు వివరాలను సరి చేసుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపులకు ఏఐ టెక్నాలజీ

ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరిగే సమయంలో లబ్ధిదారుల పేరును పరిశీలించేలా ఏఐ టెక్నాలజీ అప్‌డేట్ చేస్తున్నారు. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా ఆర్థిక సాయం ఖాతాలో జమ కాకుండా నిలిచిపోతోంది. లబ్ధిదారుల పేరు, ఆధార్ నెం బరు జత అయిన మరో వ్యక్తి పేరు ఒక్కటే అయినప్పుడు ఇంటిపేరుతో సరిపోల్చి చూస్తున్నారు. ఇంటిపేరు ఒకటే అయినప్పుడు ఇంటి నెంబరుతో సరిపోల్చి చూసేలా కొత్తగా అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో ఆర్థికసాయం మొత్తం వేరే వారి ఖాతాల్లో జమ కాకుండా అడ్డుకుంటుంది.

రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు కేంద్రం కుట్ర

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం సృష్టించి మోదీ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందాలని భావిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రభాయి సంతాపసభలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎండీ అబ్బాస్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తుపెంచి బనకచర్లను నిర్మించడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బనకచర్ల నిర్మాణానికి తెలంగాణ అడ్డుకోవాలన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్ అమలు విషయంలో కేంద్రం ఆర్డినెన్స్, బిల్లు, జీవో రద్దుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఉన్న ఆరుగురు బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రంలో బీసీ అనుకూలంగా మాట్లాడుతూ ఢిల్లీలో వ్యతిరేకిస్తున్నారన్నారు. బీసీ బిల్లుకు కేంద్రం అడ్డుపడుతున్నందున తెలంగాణ బీజేపీ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. బీసీ బిల్లు అమలుకోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాన్ని కేంద్రానికి పంపాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ కుట్రకు పాల్పడుతున్న బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకోసం జరిగే ఉద్యమానికి సీపీఎం మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో సీపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల, సయ్యద్ హాసం తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సెల్‌ఫోన్ దుకాణం దగ్ధం

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో సెల్‌ఫోన్ దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం జరిగింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణకేంద్రంలోని తంగెడపల్లిరోడ్డులోగల చందు మొబైల్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం భోజనానికి దుకాణం మూసి యజమాని ఇంటికి వెళ్లాడు. దుకాణంలో మంటలు లేవడంతో పక్క దుకాణం యజమానులు సమాచారం అందించారు. యజమాని వచ్చేసరికి దుకాణంలో మంటలు దట్టంగా వ్యాపించాయి. కంప్యూటర్, సెల్‌ఫోన్లు దగ్ధమయ్యాయి. స్థానికులు నీళ్లతో మంటలు ఆర్పారు. ఫైరింజన్ వచ్చేలోపే మంటలు ఆర్పేశారు. రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని చందు తెలిపాడు. చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ దగ్ధం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

చింతపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామశివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాయినిగూడెం గ్రామశివారులో నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని పెట్రోల్ పోసి కాల్చినట్లు స్థానికులు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి

గరిడేపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, హెడ్‌కానిస్టేబుల్ రవి తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బొంత సైదిరెడ్డి(75) పొనుగోడు గ్రామ శి వారులోని ఓ ఫంక్షన్‌హాల్లో తన బంధువుల శుభకార్యంలో పాల్గొనేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తుండగా కోదాడ, మిర్యాలగూడ ఎన్‌హెచ్-167పై గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మగుడి యూ టర్న్ వద్దకు రాగానే అప్పన్నపేట వైపు నుంచి గరిడేపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సైదిరెడ్డిని స్థానికులు వెంటనే మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సైదిరెడ్డి కుమారుడు మట్టారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● ఆడపిల్లలు పుట్టారని వేధిస్తున్నాడని ఆరోపణ

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని భర్త వేధిస్తున్నాడని ఓ వివాహిత ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లిదండ్రులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడింది. యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామానికి చెందిన గజం అంజనేయులు, అరుణ పెద్దకూతురైన తనకు జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశపురం గ్రామానికి చెందిన కొన్నె బాలరాజ్‌కు 2016లో వివాహం చేశారని తెలిపింది. వివాహమైన మూడు నెలల నుంచి భర్త వేధిస్తున్నాడని ఆరోపించింది. మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టిందని, రెండు సంవత్సరాల తర్వాత మరో ఆడపిల్ల, తర్వాత కూడా మరో ఆడపిల్ల పుట్టిందని తనను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో భర్తతోపాటుగా అత్తామామలు కూడా వేధిస్తున్నారని పేర్కొంది. తన భర్త మద్యం సేవించి ప్రతిరోజూ కొడుతూ ఆత్మహత్య చేసుకొనే విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించింది. తనతో ఉంటూనే 2023లో హైదరాబాద్ కూకట్‌పల్లి కోర్టులో విడాకుల కోసం ఫిర్యాదు చేసి తన తల్లిగారి గ్రామం బాహుపేటకు తప్పుడు అడ్రస్‌తో కోర్టు ద్వారా నోటీసులు పంపుతున్నాడని, అప్పటికే పలుమార్లు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని తన భర్తకు పోలీసులు నచ్చజెప్పి పింపించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ముగ్గురు పిల్లలను తీసుకెళ్లాడని, తాను మహిళా సంఘాలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే పిల్లలను పోలీస్‌స్టేషన్ వద్ద వదిలి వెళ్లాడని చెప్పింది. ఈ నెల 11న కూకట్‌పల్లి కోర్టుకు చెందిన న్యాయవాదిని తీసుకొని వచ్చి పోలీసులతో మాట్లాడి తమ గ్రామం బాహుపేటకు చెందిన పెద్దమనుషులను అవమానించే విధంగా మహిళా అడ్వకేట్ తనను, ముగ్గురు ఆడపిల్లలను చూడకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేసి తనను అవమానించిందని బాధితురాలు పేర్కొంది. తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని కోరింది.

మద్యం టెండర్లు డీలా

● యాదాద్రిభువనగిరి జిల్లాలో 82దుకాణాలకు 323 టెండర్లు

● 21దుకాణాలకు స్పందన కరువు



భువనగిరి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల మద్యం విక్రయ లైసెన్స్‌ల జారీకి జారీ అయిన టెండర్లకు వ్యాపారుల నుంచి స్పందన కరువవుతోంది. సెప్టెంబరు 24న ప్రారంభమైన టెండర్ దరఖాస్తుల గడువు ఈ నెల 18వ తేదీ వరకు ఉండడంతో అధికార వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి. కాగా జిల్లాలోని 82 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 323 దరఖాస్తులు రాగా 21 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోగా 16దుకాణాలకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా అరూరు దుకాణానికి 29, ఎల్లంబావి 28 దరఖాస్తులు వచ్చాయి. కాగా దరఖాస్తుల ఫీజు రూపేనా జిల్లా నుంచి ప్రభుత్వానికి ఇప్పటివరకు 9.69 కోట్ల ఆదాయం సమకూరింది.

ఆసక్తి చూపని మద్యం వ్యాపారులు

గతంలో మద్యం వ్యాపారం క్రేజీగా ఉండేది. నిత్యం లక్షల రూపాయల టర్నోవర్ ఉండడంతో పాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభించేది. అలాగే కమిషన్ ఇతర రూపకాలలో ఆదాయం ఘనంగా ఉండేది. కానీ ప్రభుత్వం నిబంధనలను కఠిన తరం చేయడంతో పాటు దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడంతో దరఖాస్తు చేసేందుకే వ్యాపారులు వెనకాడుతున్నట్టు తెలుస్తోంది. గతంలో ఒక్కో సిండికేట్ 70కి పైగా దరఖాస్తులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో దుకాణాలు లభించకపోవడంతో దరఖాస్తు ఫీజుల రూపేనా భారీగా నష్టపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2025-27 సంవత్సరాలకు కేటాయించనున్న మద్యం దుకాణాల టెండర్ దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచడం, లాటరీ విధానంలో దుకాణాల కేటాయింపు ఉండడంతో అదృష్టం సహకరించకుంటే మరోసారి నష్టపోతామనే భావనతో పలువురు దరఖాస్తు చేసేందుకే నిరాశక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగతోంది. దరఖాస్తు గడువు ఆరు రోజులు ఉండటం, గతంలో కూడా చివరి రెండు రోజులలోనే భారీగా దరఖాస్తులు రావడంతో ఈసారి కూడా అలాగే జరుగుతుందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. పైగా మద్యం వ్యాపారులను నేరుగా లేదా ఫోన్లలో పలకరిస్తూ టెండర్లు వేసేలా ప్రోత్సహిస్తుండటం చేర్చనీయాంశంగా మారింది. యాదాద్రిభువనగిరి జిల్లాలోని 82 దుకాణాలకు శనివారం నాటికి 323 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పంచమి శనివారం రోజే 96 దరఖాస్తులు రావడం గమనార్హం. 82 దుకాణాలలో 53 జనరల్, 21 గౌడ, 7 ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు కేటాయించారు. ఈమేరకు ఇప్పటివరకు అత్యధికంగా మోత్కూర్ సర్కిల్ పరిధిలోని అరూరు దుకాణానికి 29, రామన్నపేట సర్కిల్‌లోని ఎల్లంబావి దుకాణానికి 28 దరఖాస్తులు వచ్చాయి. 16 దుకాణాలకు ఒకటి చొప్పున దరఖాస్తు రాగా 21 దుకాణాలకు స్పందన కరువైంది. ఒక్క దరఖాస్తు కూడా రాని దుకాణాలలో భువనగిరి పట్టణంలోని పదవనెంబర్ దుకాణం కూడా ఉండటం గమనార్హం.

మద్యం దుకాణానికి ఒకే ఒక్క టెండర్

చింతలపాలెం: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో గతంలో మూడు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా, ఈసారి మాత్రం రెండు మద్యం షాపులకు కుదించారు. దొండపాడు గ్రామ పరిధిలో ఉన్నది గౌడు సామాజిక వర్గానికి రిజర్వేషన్ కాగా, చింతలపాలెం మండల కేంద్రం పరిధిలో ఉన్న మద్యం దుకాణం జనరల్ రిజర్వేషన్‌గా వచ్చింది. శనివారం వరకు చింతలపాలెం మండలంలో రెండు మద్యం దుకాణాలకు కలిపి ఒకటే టెండర్ నమోదైంది. వ్యాపారుల నుంచి ఆశించిన స్పందన లేక పోవడంతో దరఖాస్తులు భారీగా తగ్గాయి.

లక్ష్మీపుష్కరిణిలోకి గోదారమ్మ

▸ 16లక్షల లీటర్ల నీటి వినియోగం

▸ భక్తుల తాకిడి మేరకు నీటి తొలగింపు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులకు అందుబాటులోకి వచ్చిన పుష్కరిణి

యాదగిరిగుట్ట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులకు కొండకింద ప్రత్యేకంగా ఆధ్యాత్మిక వాడను రూపొందించారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాలతో కొండకు (కొండకింద) ఉత్తర భాగంలో లక్ష్మీపుష్కరిణి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించగా గోదావరిజలాలతో నింపి భక్తులకు అందు బాటులోకి తెచ్చారు. గండి చెరువుకు అభిముఖంగా కొండపైన నిర్మించిన ఉపరితల జలాశయం గుండా లక్ష్మీపుష్కరిణిలోకి చేరుకుంటున్న గోదావరి నీటిలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్నారు. గుండంలోని నీటిని నిత్యం పర్యవేక్షిస్తూ భక్తుల తాకిడి మేరకు మార్చుతుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పుష్కరిణికి చేరుతున్న నీరు మల్లన్నసాగర్ మీదుగా బస్వాపూర్ జలాశయం నుంచి 16వ ప్యాకేజీ ప్రధాన కాల్వ ద్వారా యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి వద్ద నిర్మించిన ఓటీ-2 కాల్వలోకి చేరుకుంటాయి. అక్కడి నుంచి దాతారుపల్లి, మల్లాపురం గుండా సుమారు పది కిలోమీటర్లు ప్రవహించి పుష్కరిణికి చేరుతాయి. దేవస్థానం ఆధీనంలో లక్ష్మీపుష్కరిణి సుమారు 16లక్షల లీటర్ల నీటితో నింపుతున్నారు.

● గత ప్రభుత్వం వైటీడీఏ ఆధ్వర్యంలో దీక్షపరుల మండపం, కల్యాణకట్ట, అన్నదాన భవనం, జిల్లా బస్సు సర్వీసుల కోసం బస్టాండు, కొండపైకి వెళ్లేందుకు ప్రత్యేకంగా మరో బస్టాండ్‌తో పాటు దుకాణ సముదాయాలు క్షేత్రానికి ఉత్తర భాగంలో నిర్మించారు. గండి చెరువు కింది భాగాన నిర్మించిన లక్ష్మీపుష్కరిణిలో ప్రస్తుతం భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్నారు. దీంతో పాటు కొండపైన ప్రత్యేకంగా రూ.100 రుసుంతో పుణ్య జలాలు చల్లుకునేందుకు దేవస్థానం సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది.

ఐదు మోటర్ల ద్వారా..

గోదావరి నీళ్లను 12.5హెచ్.పీ ఐదు మోటార్ల ద్వారా పుష్కరిణిలోకి తరలిస్తున్నారు. వీటిని నాలుగు ఫిల్టర్లతో తిరిగి పుష్కరిణిలోకే రీ-సర్క్యూలేషన్ చేస్తున్నారు. అలా గుండంలోకి చేరిన నీటిని లిక్విడ్ ఫ్లోరిన్‌తో పాటు నీటిశుద్ధి కోసం టీసీసీ గ్రానర్స్ కలుపుతూ అప్పుడప్పుడు అలం(బిల్లలు) కూడా వాడుతున్నారు. పుష్కరిణికి చేరిన నీటిని 8.0శాతం పీహెచ్ మించకుండా డిటిజల్ మీటర్‌తో పర్యవేక్షిస్తారు. క్లోరిన్ శాతాన్ని కూడా రసాయనిక చర్య ద్వారా 2.5 మించకుండా పర్యవేక్షిస్తారు. పుష్కరిణిలో నీరు కలుషితం కాకుండా భక్తులకు సూచనలు చేస్తూ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో నీళ్లు అందుబాటులోకి వస్తున్నాయి.



యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు 40వేల మంది భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి నుంచే యాదగిరిగుట్టకు చేరుకున్న భక్తులతో ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు రద్దీగా మారాయి. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం(ఆరగింపు) సమయాల్లో సుమారు మూడు గంటలు భక్తులు వేచి ఉన్నారు. ప్రత్యేక దర్శనానికి అర్ధగంట, ధర్మదర్శనానికి సుమారు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా భక్తుల రద్దీ ఉంది. కొండపైకి, కిందకు భక్తులను తరలించేందుకు అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలోనే పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో వాహనాల మధ్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 49,68,644ల ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, ప్రతి వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా ఉత్తర సెంటర్ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ (హైదరాబాద్) కళాకారుల భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం,నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు.పాతగుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

అందుబాటులోకి రాని రథశాల షటర్

వైటీడీఏ ఆధ్వర్యంలో ఆలయ వాయువ్య దిక్కులో స్వామివారి రథశాల నిర్మించారు. విద్యుత్ మోటారు సహాయంతో పైకి..కిందకు రావాల్సిన షటర్ సమస్య తలెత్తి ఒకవైపే పైకి లేచింది. షెట్టరు పైభాగంలో బిగించిన మోటారును కిందకు దించిపైకి ఎక్కించేందుకు కర్రలు బిగించారు. మోటారులో సమస్యలు తలెత్తడంలో హైదరాబాద్‌కు తరలించి సుమారు రెండు నెలలు కావస్తోంది. త్వరలో మోటారుకు మరమ్మతులు నిర్వహించి దేవస్థానం షెట్టరు అందుబాటులోకి తేనున్నట్లు సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాడ్గులపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కల్వలపాలెం పాలేరు వాగునుంచి అనుమతి లేకుండా అదే గ్రామానికి చెందిన ఉప్పునూతల నాగరాజు, చిట్యాల ప్రవీణ్, చిట్యాల సురేష్ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మూడు ట్రాక్టర్లను ఇందుగుల గ్రామ శివారులో పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నాగరాజు, ప్రవీణ్, సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోదాములో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదం జరిగిన గోదాం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీలోని లక్ష్మీపవన్ ఎలక్ట్రికల్స్, విజయలక్ష్మీ ఆటోమోటివ్స్ గోడౌన్‌లో మంటలు ఎగిసిపడడంతో ఎలక్ట్రికల్, ఆటోమోటివ్ పరికరాలు, సామాగ్రి కాలి బూడిదయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. దట్టంగా అలుమున్న పొగతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

ఒడిశాలో నల్లగొండ జిల్లావాసి మృతి

చిట్యాల, అక్టోబరు12, (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలో ఏనుగుల దాడిలో నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన రుద్రారపు సైదులు(45) కొంతకాలంగా చిట్యాలలోనే నివాసముంటున్నాడు. సైదులు తనకున్న బోరుబండిని ఒడిషా రాష్ట్రంలోని దెంకనల్ జిల్లాలో నింబహల్‌లో నడిపిస్తున్నాడు. దసరా పండుగకు చిట్యాలకు వచ్చి వెళ్లిన ఆయన శనివారం ఉదయం బహిర్భుమికి బయటకు వెళ్లగా ఒక్కసారిగా వచ్చిన ఏనుగుల గుంపు దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు అంత్యక్రియలు ఆదివారం చిట్యాలలో జరిగాయి.

మనస్తాపంతో బలవన్మరణం

హాలియా, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పాతనబోయిన నవీన్(30) డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆర్థిక సమస్యలతో మానసికంగా బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తమ్ముడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అరెస్టులతో రైతుల ఉద్యమాన్ని ఆపలేరు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అరెస్టులతో రైతుల ఉద్యమాన్ని ఆపలేరని త్రిపుల్ ఆర్ భూ నిర్వసితుల న్యాయ పోరాట సమితి కన్వీనర్ దబ్బటి రామ్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు వెళ్తున్న సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన త్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుడు రామ్‌గౌడ్‌ను ముందస్తు అరెస్టు చేశారు. హయత్‌నగర్‌లో వాకింగ్ చేస్తున్న ఆయనను వనస్థలీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎం, డిప్యూటీ సీఎం కార్య క్రమం ముగిశాకా ఆయనను విడిచిపెట్టారు. ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం రైతులపై అక్రమ కేసులె బనాయించి ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందని రామ్‌గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో 100 నామినేషన్లు వేసి కాంగ్రెస్‌ను ఓడిస్తామన్నారు.

మర్రిగూడ: మాజీమంత్రి దామోదర్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి తుంగతుర్తికి వస్తున్న సందర్భంగా ట్రిబుల్‌ఆర్ బాధితులు అక్కడికి వెళ్తున్నారన్న సమాచాంతో పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం హాస్యాస్పందంగా ఉందని బాధిత రైతులు పగిల్లా రమేష్, జాల విగ్నేష్ అన్నారు. ఆదివారం పోలీసులు ట్రిబుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న వివిధ గ్రామాలకు చెందిన రైతుల ఇళ్లలోకి వెళ్లి అరెస్టు చేశారు.

వలిగొండ: ట్రిబుల్‌ఆర్ బాధితుల అరెస్టులు సరికాదని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో ట్రిబుల్‌ఆర్ బాధితులను అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ఎన్నికలకు ముందు ట్రిబుల్‌ఆర్ అలైన్మెంట్ మారుస్తామని అనేక మాయ మాటలు చెప్పి నేడు సన్నచిన్న కారు రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి కందడి సత్తిరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కల్యూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడలో పోలీసుల అదుపులో ట్రిబుల్‌ఆర్ బాధిత రైతులు

ప్రీ ప్రైమరీ బోధన అంతేనా?

జిల్లాలో 35ఎంపీపీఎస్‌ల్లో ప్రీ ప్రైమరీకి అనుమతి

ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలని తొలత నిర్ణయం

రెండు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని తరగతులు

ఎంపిక చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)ల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆయా మండలాల పరిధిలో గుర్తించిన ఎంపీపీఎస్‌లలో ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలని నిర్ణయించారు. రెండు నెలలు పూర్తవుతున్నా ప్రీ ప్రైమరీ తరగతులను ఇంకా ప్రారంభించలేదు.

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి



ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని సంకల్పించింది. నల్లగొండ జిల్లాలో తొలి విడత 35 ఎంపీపీఎస్‌లలో ప్రీ ప్రైమరీ తరగతులు బోధించేందుకు అనుమతిచ్చింది. అంగన్‌వాడీ గదులను మరపించేలా.. చిన్నారులను ఆకర్షించేలా.. ఆయా పాఠశాలల్లో ఓ తరగతి గదిని రంగులు, గోడలపై బొమ్మలతో తీర్చిదిద్దాలని సూచించింది. ప్రత్యేక నిధిని మంజూరు చేస్తామని చెప్పినా నిధులు అందలేదు.

ఎంపికకు ప్రామాణికం ఇదే

నల్లగొండ జిల్లాలోని 35మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ల్లో ప్రీప్రైమరీ (ఎల్‌కేజీ, యూకేజీ) తరగతుల నిర్వహణకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ అనుమతిచ్చారు. జూలై 26వ తేదీన ఈ ఉత్తర్వులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జిల్లా విద్యాశాఖాధికారులకు చేరాయి. ప్రతీ ఏడాది ఆన్‌లైన్‌లో నమోదు చేసే యూ డైసీ వివరాలు, అదనపు తరగతి గదుల లభ్యత, జీరో ఎన్‌రోల్‌మెంట్ వంటి అంశాలే ప్రామాణికంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపీపీఎస్‌లను ఎంపిక చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో చేరేందుకు అర్హత ఉండే చిన్నారులను ప్రీ ప్రైమరీ కోసం గుర్తించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

ప్రీ ప్రైమరీకి ఎంపికైన ఎంపీపీఎస్‌లు

ఎర్రచెరువుతండ, రావులపెంట, నర్సాపూర్, శేరిపల్లి, మల్లారెడ్డిపల్లి, కడపర్తి, తిర్మలగిరి, ఖిల్లాబజార్ దేవరకొండ, అమ్మగూడెం, ఎలికట్టె, చందంపల్లి, మర్రూర్, దొనియాల, ముత్యాలమ్మబజార్ దేవరకొండ, అమ్మనబోలు, బోయనపల్లి, ఎరగుంట్లపల్లి, తెట్టెకుంట, వెంకటాద్రిపాలెం, బోయగుబ్బ, ఎనుగులదొరి, పూలగూడెం, కొండమల్లేపల్లి, బోడంగిపర్తి, బుద్దారెడ్డిగూడ, తేనేపల్లి తండ, జిన్నాయి చింత, కందిమల్లివారిగూడెం, పెద్దతండా, చింతపల్లి, సోలిపురం, హరిజనవాడ ఉట్లపల్లి, ఎస్‌సీ కాలనీ అజ్మాపురం, వైజాగ్‌కాలనీ, బచ్చాపురం, కామారెడ్డిగూడెం పాఠశాలలు ఉన్నాయి.

యూడైస్‌లో చిన్నారుల నమోదు

ప్రీ ప్రైమరీ తరగతుల బోధన కోసం అనుమతి ఉన్న ఎంపీపీఎస్‌లలో చిన్నారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. మూడేళ్ల వయసు దాటిన చిన్నారులను యూడైస్‌లో నమోదు చేసే ప్రక్రియ ఇపుడిపుడే మొదలైంది. యూడైస్‌లో నమోదైతేనే పాఠశాలకు బడ్జెట్ కేటాయింపులతో చిన్నారులకు మధ్యాహ్నం భోజనం తదితర రెగ్యులర్ పాఠశాల విద్యార్థులకందే కనీస వసతులు సమకూరనున్నాయి.

ఇంకా నియామకం కాని వలంటీర్లు, ఆయాలు

ఎంపికైన పాఠశాలల్లో వలంటీర్, ఆయాలను ఒకొక్కరి చొప్పున నియమించాల్సి ఉంది. వలంటీర్ పోస్టు కోసం ఇంటర్ ఆ పై తరగతులు చదివిన అదే గ్రామానికి చెందిన స్థానికులైన వారై ఉండాలని ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఆపైన చదివిన వారినే అర్హులుగా పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి ఎంఈవోలు దరఖాస్తులను స్వీకరించి ఈనెల 1 నాటికే డీఈవోకు అందజేశారు. వలంటీర్లు, ఆయాల పోస్టుల కోసం ఎంపిక చేసిన పాఠశాలల నుంచి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్థాయిలో పరిశీలించాల్సి ఉంది.

త్వరగా నియామకాలు చేపట్టాలి



ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహించేందుకు మా పాఠశాలను ఎంపిక చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం చిన్నారులను గుర్తించి యూడైస్‌లో నమోదు చేసే ప్రక్రియను మొదలు పెట్టాం. ఇప్పటికే 6 గురు చిన్నారులను నమోదు చేయించాం. అయితే జిల్లా అధికార యంత్రాంగం సత్వరమే ప్రీ ప్రైమరీ తరగతుల కోసం వలంటీర్, ఆయా నియామకాలను చేపట్టాలి. అదేవిధంగా ప్రత్యేక గదుల సుందరీకరణ నిధులను విడుదల చేయాలి.

● కొన్నె శంకర్‌గౌడ్, హెచ్ఎం, ఎంపీపీఎస్, అమ్మనబోలు, నార్కట్‌పల్లి మండలం

అన్ని ఎంపీపీఎస్‌ల్లో ప్రీ ప్రైమరీకి అనుమతి



ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఇపుడు అన్ని ఎంపీపీఎస్‌లకు అనుమతి ఇచ్చింది. ఆసక్తి ఉన్న ఎంపీపీఎస్‌ల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతానికి ప్రభుత్వం గుర్తించిన ఎంపీపీఎస్‌లకు మాత్రమే బడ్జెట్ ఇస్తారు. మండలంలో ప్రీ ప్రైమరీ తరగుతల కోసం ఇప్పటికే అధికారికంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వలంటీర్, ఆయాల పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి డీఈవోకు పంపాం.

● కూకుట్ల నర్సింహ, నార్కట్‌పల్లి, ఎంఈవో.

దామన్న కీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది

● తుంగతుర్తిలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి ఘన నివాళి



తుంగతుర్తిలో మాజీ మంత్రి ఆర్డీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమకుమార్‌రెడ్డి పొంగులేటి, కోమటిరెడ్డి ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు బాలునాయక్, మందుల సామేలు, బీఎల్ఆర్, మాజీ ఎంపీ హనుమంతురావు

ప్రాణం కన్నా కాంగ్రెస్సే మిన్నగా భావించారు



మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి తన ప్రాణం కన్నా కాంగ్రెస్‌నే ఎక్కువగా ప్రేమించాడు. పార్టీకి ఆయన సేవలు మరువలేనివి. 1985 నుంచి నేటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ కోసం పాటుపడ్డారు. ఎస్సారెస్పీ జలాల కోసం పరితపించి ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి రక్తతర్పణం చేశాడన్నారు. దామోదర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు, భవనాలు శాఖ మంత్రి


బావితరాలకు ఉపయోగపడే పనులు చేశారు

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చిన వారైనందునే ఆయన శ్రీరాంసాగర్ జలాల కోసం పోరాడి సాధించారు. దామోదర్‌రెడ్డి భావితరాలకు ఉపయోగ పడే పనులు చేశారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. దామోదర్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాను, ఆయన అన్న వెంకట్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాను కాపాడారు.



-పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

దామన్న లేరన్నది జీర్ణించుకోలేక పోతున్నా




మన మధ్య దామన్న లేక పోవడం కాంగ్రెస్ కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు 40 ఏళ్లుగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండాను నిలబెట్టిన యోధుడు దామోదర్‌రెడ్డి. ఎస్సారెస్పీ నీటి కోసం ఆయన చేసిన పోరాటం అమోఘం. ఆయన పోరాట ఫలితంగా నేడు జిల్లాకు ఎస్సారెస్పీ జలాలు వస్తున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో పూడిక తీత పనులు త్వరలో చేపడుతాం. ఎస్సారెస్పీ కాల్వలు మరమ్మతు చేపట్టి ఈ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలం చేస్తాం.

- నలమాద ఉత్తమ్‌కుమార్ భారీనీటిపారుదలశాఖ మంత్రి



తుంగతుర్తిలో మాజీ మంత్రి ఆర్డీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే సాంబశివరావు, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు



సీఎం రేవంతర్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హనుమంతరావు చిత్రంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు

సర్వోత్తమరెడ్డికి అండగా ఉండాలి



తాను యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దామోదర్‌రెడ్డి కోశాధికారిగా ఉన్నారు. ఆయనతో తనకు ఎంతో అనుబంధం ఉంది. తల్లిదండ్రులను కోల్పోయిన సర్వోత్తమరెడ్డికి పార్టీ అండగా ఉండి సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు దామోదర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చే సమయంలో ఎమ్మెల్యేగా ఓడిపోవడం బాధకరం. సభా ముఖంగా దామోదర్‌రెడ్డి అభిమానుల మధ్య సర్వోత్తమరెడ్డి చేతిని సీఎం చేతిలో పెట్టి ఆయన్ను కాపాడాలి

- హనుమంతరావు, మాజీ ఎంపీ

జనం మెచ్చిన నేత దామోదర్‌రెడ్డి



నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి కమ్యూనిస్టులను ఎదుర్కొని కాంగ్రెస్‌ను నిలబెట్టారన్నారు. దొరల కుటుంబం నుంచి వచ్చినా వారు ఏనాడు దొరల్లా ప్రవర్తించలేదు. వారిద్దరూ జనం మెచ్చిన నేతలు.

- సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం (సీపీఐ రాష్ట్ర కార్యదర్శి)


సీఎం రాక సందర్భంగా భారీ బందోబస్తు

మోత్కూరు/తుంగుతుర్తి (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సందర్భంగా తుంగతుర్తిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ రేంజ్ డీఐజీ చౌహాన్ పర్యవేక్షణలో ఎస్పీ నర్సింహ, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 24 మంది సీఐలు, 80 మంది ఎస్‌ఐలు, 400 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. సీఎం రాక సందర్భంగా 365బీ జాతీయ రహదారిపై తుంగతుర్తి మీదుగా మహబూబాబాద్, ఖమ్మం వెళ్లే వాహనాలను అర్వపల్లి నుంచి దారి మళ్లించి సూర్యాపేట మీదుగా పంపించారు. మహబూబాబాద్ నుంచి వచ్చే వాహనాలను మద్దిరాల నుంచి సూర్యాపేట మీదుగా మళ్లించారు.

ప్రముఖుల నివాళి

దామోదర్‌రెడ్డి సంతాప సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్, బీర్ల అయిలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, పద్మావతి, కోరం కనకయ్య, రాగమయి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, మార్కెట్ ఛైర్మన్ వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు కొట్టిన నేత



కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు కొట్టిన గొప్ప నేత దామోదర్ రెడ్డి. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.

- మందులసామేలు, ఎమ్మెల్యే, తుంగతుర్తి



మాజీ మంత్రి ఆర్డీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు




ఆర్డీఆర్ సంతాపసభకు హాజరైన అభిమానులు

బుద్ధవనంలో రేపు దమ్మ విజయ వేడుకలు



నాగార్జునసాగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జి ల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనంలో బుధవారం దమ్మ విజయ వేడుకలు నిర్వహించనున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామ్రా ట్ అశోక్ చక్రవర్తి 2300 ఏళ్ల క్రితం బౌద్ధాన్ని స్వీకరించిన అశోకుడు విజయ దశమి (అక్టోబరు 14వ తేదీ)ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956 అక్టోబరు 14వ తేదీన నాగ్‌పూర్‌లో దమ్మ దీక్ష తీసుకున్న రోజున ఈ వేడుక నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు బుద్ధవనంలో దమ్మ విజయ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ వేడుకలకు పూణే విశ్వవిద్యాలయానికి చెందిన మహేస్ దియోకర్, నల్లగొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, హైదరాబాద్ రెడ్డి కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, సాగర్ బీసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ వేడుకలకు స్థానికులు, బౌద్ధ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సాగర్ 6 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



సాగర్ 6 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజె క్టు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 589.90 అడుగులుగా (311.7462 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10040 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,292 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లల్లో 6 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 48,540 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 101180 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 101180 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో

కేతేపల్లి, : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి 2,018.50 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లోగా నమోదైంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో 8వ నంబరు క్రస్టుగేటును 2అడుగుల మేర ఎత్తి 1,319.55 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అ డుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రా జెక్టు ప్రస్తుత నీటిమట్టం644.40అడుగులు(4.30టీఎంసీలు)గా ఉంది.

స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలి

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్ల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాలకు స్థానికులు మాత్రమే టెండర్ వేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ని యోజకవర్గంలో అన్ని మండలాల్లో అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో గ్రామాల్లో బెల్ట్ షాపులు మూతపడ్డాయని గుర్తు చేశారు. ఇక మళ్లీ బెల్ట్ షాపులు తెరవనీయబోమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా స్థానికులు మాత్రమే ఎంపిక చేసిన మద్యం దుకాణానికి టెండర్ వేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతవాసులు టెండర్ వేసుకోవద్దని సూచించారు. కేవలం మండల కేంద్రంలోనే కాకుండా నాలుగు గ్రామాలను కలుపుకొని ఒక గ్రామాన్ని కేంద్రంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టెండర్ దక్కించుకున్న దుకాణాలను సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు మాత్రమే తెరిచి మద్యం విక్రయించాలని అన్నారు. కొత్త మద్యం దుకాణాలను ఊరి వెలుపల సిట్టింగ్ లేకుండా ఏర్పాటు చేయాలని, బెల్ట్ షాపులకు మాత్రం మద్యం అమ్మవద్దని స్పష్టం చేస్తూ ఎక్సైజ్ శాఖకు సంబంధం లేకుండా విధించిన షరతులు వివరించారు. ఈ షరతులకు ఎక్సైజ్ శాఖకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గ్రామాల్లో మద్యం బారిన పడి ప్రాణాలు కోల్పోయి బజారు పడుతున్న బాధిత కుటుంబాల పరిస్థితిని చక్కదిద్దటం, మహిళా సాధికారిత లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయానికి కట్టుబడి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నల్లగొండ డీఈవోపై చర్యలు తీసుకోవాలి

● మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడేళ్లుగా జిల్లాలో ఇక్కడి తిష్ట వేసిన డీఈవో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను మచ్చిక చేసుకున్నాడని ఆరోపించారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల నుంచి లంచాలు తీసుకుని తిరిగి వారిని అదే పాఠశాలల్లో నియమిస్తున్నాడని పేర్కొన్నారు. సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా, విద్యార్థులను టూర్లకు తీసుకెళ్లకుండా ప్రభుత్వ నిధులు బుక్కుతున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న డీఈవో, ఆయనకు సహకరిస్తున్న ఎంఈవో, హెచ్ఎంలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, కోదండరాం, ఆకునూరి మురళీ వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శని, ఆదివారాలు వరుస సెలవు దినాలు కావడంతో ఆదివారం పర్యాటకుల సందడి నెలకోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిద ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్‌కు తరలి వచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, కొత్త వంతెన, విజయవిహార్, అనుపు, ఎత్తిపోతల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు ప ర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు లాంచీ ట్రిప్పులు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.



లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్/ కేతేపల్లి అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు రద్దీ నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాతో పాటు చౌటుప్పల్ పట్టణంలో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివాహ శుభ కార్యాలకు తోడు రెండు రోజుల సెలవు కావడంతో హైదరాబాద్ నుంచి ఏపీకి, తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు, ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన వారంతా తిరిగి హైరాబాద్ బాట పట్టారు. చౌటుప్పల్ పట్టణంలో దాదాపుగా 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పంతంగి టోల్‌గేటు వద్ద కిలో మీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో టోల్‌గేటు నిర్వాహకులకు 16గేట్లకు 10గేట్ల ద్వారా వాహనాలను హైదరాబాద్ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 35వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ఆదివారం అదనంగా 12వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించాయి.ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కేతేపల్లిలో రహదారిపై వాహనాలు బారులు కట్టి వెళ్తుండడంతో హైవే వెంట గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేవారు, పశువులు, గొర్రెలు, మేకలు రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారింది.



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్ బదిలీ

● ఇన్‌చార్జి డీఆర్‌గా రవీందర్

నల్లగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ ఎస్.ప్రకాశ్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి డీఆర్‌గా ప్రకాశ్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ డీఆర్ ఎం.రవీందర్ రావుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా డీఆర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. రవీందర్‌రావు సోమవారం బాధ్యతలను స్వీకరించనున్నట్లు సమాచారం.

మూతబడిన పాఠశాలలు నేడు పునః ప్రారంభం



జయరాంతండాలో విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈవో తరి రాము

పెద్దవూర, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు లేక మూతబడిన పాఠశాలలను సోమవారం తిరిగి ప్రారంభించనున్నట్లు ఎంఈవో తరి రాము లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎర్రకుంటతండా, జయరాంతండా, భాషనుబాయ్, కలశానువారిగూడెం, కేకేతండా, యేనేమీదితండా, నాయినివానికుంట, నాయినివానికుంటతండా, రామన్నగూడెంతండా తదితర ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నందున ప్రారంభించనున్నట్లు తెలిపారు. సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిరోజు గ్రామాలను సందర్శించి గ్రామస్థులను కలుస్తూ విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో 5 నుంచి 14 ఏళ్లలోపు పిల్లల ఎంతమంది ఉన్నారు, ఎక్కడ చదువుతున్నారు వివరాలను నమోదు చేసి, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు.

నేడు భక్తాంజనేయస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

నల్లగొండ, కల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుని జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజేయస్వామి దేవాలయం శివాలయంలోని శివలింగానికి సోమవారం రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కళాశిక కుశలయ్య ఆదివాంర ఒక ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్య హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్‌ఐ లింగారెడ్డి

నాంపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నాంపల్లి ఎస్‌ఐ లింగారెడ్డి అన్నారు. మండలంలోని రాందాసుతండాలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న మెగావత్ లాలునాయక్‌ను అరెస్ట్ చేసిన అతని నుంచి రెండు లీటర్ల నాటుసారా, 20 కేజీల బెల్లం, మూడు కిలోల పట్టిక స్వాధీనం చేసుకొని 20 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎక్సైజ్ పోలీసులతో కలిసి దాడులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

గుంతతో రాకపోకలకు ఇబ్బంది



నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రవేశ ద్వారం మూలమలుపు వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అసంపూర్తి రోడ్డు విస్తరణ పనులకు తోడు వర్షాలు పడినప్పుడు వచ్చే వరద ఉధృతికి ప్రవేశద్వారం వద్ద గుంతలు పడి...కంకర తేలింది. బస్టాండ్‌లోకి వచ్చి పోయే మార్గాల్లో కూడా ఈ సమస్య ఇలాగే ఉంది. కొన్ని నెలలుగా ఈ సమస్య ఇలాగే ఉన్నా ఇటు ఆర్టీసీ అధికారులు కానీ అటు ఆర్‌అండ్‌బీ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఈ గుంతలపై నుంచే బస్టాండ్‌కు ప్రయాణికులతో వస్తూ... వెళ్తున్న బస్సులు కుదుపునకు గురవుతూ అటు ప్రయాణికులకు అసౌకర్యం కలిగించడమే కాకుండా బస్సులోని కొన్ని విడిభాగాలు కూడా దెబ్బతినేందుకు కారణమవుతోంది. కళ్ల ముందే ఈ సమస్య కనబడుతూ బస్సులు దెబ్బతిని లక్షల్లో నష్టాన్ని మూల్యంగా చెల్లించుకునే బదులు ముందుగానే మేల్కొని చిన్నగుంతను పూడ్చి వేయించే పనులు చేపడితే మంచిదని ప్రయాణికులు సూచిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- నార్కట్‌పల్లి

బీవెల్లెంలలో ప్రమాదకరంగా మూలమలుపు



నార్కట్‌పల్లి మండలంలోని బీ. వెల్లెంల నుంచి వయా శేరుబావి గూడెం మీదుగా ఎల్లారెడ్డిగూడెంనకు వెళ్లే రోడ్డులో ఏపుగా పెరిగిన కంపచెట్లతో మూలమలుపులు... ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపుగా వివిధ రకాల చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రధానంగా మూలమలుపుల వద్ద రోడ్డును కప్పేసేలా పెరిగిన ఈ చెట్లతో ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఏర్పడింది. రోడ్డుపై రెండు వైపులా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కూడా కనపడని పరిస్థితి. చీకట్లో అయితే మూలమలుపుల వద్ద మరీ ఇబ్బందికరంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. వాస్తవానికి ప్రతీ యేటా రోడ్డు నిర్వహణ చేయాల్సి ఉంది. కానీ రోడ్డు మరమ్మతులు, నిర్వహణ చేపట్టకపోవడంతో చెట్లు ఏపుగా పెరిగాయి. కనీసం ఉపాధి హామీ పథకం కిందనైనా కూలీలను వినియోగించి మూలమలుపుల వద్ద ప్రమాదంగా పెరిగిన చెట్లను సరిచేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

- నార్కట్‌పల్లి

‘డీసీసీ పదవి మోహన్‌రెడ్డికి ఇవ్వాలి’

నల్లగొండటౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ డీసీసీ పదవిని గుమ్మల మోహన్‌రెడ్డికి ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్, మాజీ కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్‌తో పాటు అనుబంధ విభాగాలకు చెందిన నాయకులు ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతికి వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలో సాయికృష్ణ రెసిడెన్సీలో డీసీసీ అధ్యక్షుడు ఎంపిక కోసం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఆదివారం నల్లగొండ నియోజకవర్గ బ్లాక్, పట్టణ కాంగ్రెస్ నాయకుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నాయకులందరూ ఏకగ్రీవంగా గుమ్మల మోహన్‌రెడ్డికే డీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని తీర్మానిస్తూ లేఖలను అందజేశారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్, జూకూరి రమేష్, దుబ్బరూప కత్తుల కోటి, ఖయ్యూం బేగ్, ఇబ్రహీం, సమద్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందించాలి

● డాక్టర్ సీహెచ్. పుల్లారావు

నల్లగొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు, మానసిక రోగులకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలందించడం అభినందనీయమని ఐఎంఏ రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్.పుల్లారావు అన్నారు. ఐఎంఏ అసోసియేషన్, లయన్స్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రామగిరిలో గల నిర్మల్ హృదయ మందిరంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిర్మల్ హృదయ మందిరంలో 70 మంది మానసిక రోగులను పరిశీలించి సలహాలు అందజేశారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పేదలకు సేవలందించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చారి ట్రబుల్ ట్రస్ట్ డైరెక్టర్ నల్లగొండ ప్రెసిడెంట్ పిచ్చయ్య, సభ్యులు అశోక్, ఆదినారాయణ, డాక్టర్ దామర యాదయ్య, రమేష్, ప్రవీణ్, విదేయకుమార్, అనితారాణి తదితరులు పాల్గొన్నారు.

‘బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం’

మర్రిగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు వంకతో బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ సాధిస్తామని, సుప్రీంకోర్టుకు వెళ్తామని ముఖ్యమంత్రి పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ పేరుతోనే బీసీ ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టాను రీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్ కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి సర్కారుకు బుద్ధి చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రేపటి నుంచి బీసీలు నిర్వహించే ధర్నా, నిరాహార దీక్షలకు మద్దతు పలుకుతామని లింగం గౌడ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు రావాలని అన్నారు.

జీవో 25 ప్రాథమిక విద్యకు అశనిపాతం

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి

నల్లగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యకు అశనిపాతంగా మారిన జీవో 25ను వెంటనే సవరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించినప్పుడే ప్రాథమిక పాఠశాల వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. 25 జీవో ప్రకారం 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 10 మంది 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 5+1 విధానాన్ని అమలు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను అవమానపరుస్తూ పాఠశాలలకు విద్యార్థులను దూరం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల జానిరెడ్డి, గౌరవాధ్యక్షుడు తిరందాసు సత్తయ్య పాల్గొన్నారు.

బాధితురాలికి గ్రామస్థుల ఆర్థికసాయం

శాలిగౌరారం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన పొన్న జోగయ్య భార్య పుష్పలత తీవ్రమైన అనారోగ్యానికి గురై చావు బతుకుల మధ్య కామినేని ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన జోగయ్య పరిస్థితిని అర్థం చేసుకున్న గ్రామస్థులు తమ వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఇటుకులపాడు గ్రామస్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున సుమారు రూ.2 లక్షల ఆర్థికసాయం చేశారు. ఆర్థికసాయం చేసిన గ్రామస్థులకు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె త్వరగా కోలుకోవాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

గుర్జ రాఘవులు సేవలు మరువలేనివి

చిట్యాలరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు గుర్జ రాఘవులు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య అన్నారు. చిట్యాల మండలం బోయగుబ్బకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు గుర్జ రాఘవులు (82)అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రాఘవులు మృతదేహాన్ని నివాసానికి తీసుకురాగా మృతదేహంపై వారు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నతనం నుండే వామపక్ష ఉద్యమ ప్రభావంతో ఎదిగారని, పార్టీపై ఆయనకు ఎనలేని అభిమానం ఉందని కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసి వారి మనసులో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరనిలోటన్నారు. నివాళులర్పించిన వారిలో కోనేటి రాములు, రూపని ఇద్దయ్య, శిరస్సు హన్మయ్య, మామిడి హనుమంతు, వీరమళ్ళ వెంకటేశ్వర్లు, లొడే విష్ణుమూర్తి, గుర్రం భిక్షం, నర్సింహతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

నల్లగొండకల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం జరిగిన నల్లగొండ శాఖ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కమిటీ గడువు ముగిసి చాలా రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు పీఆర్‌సీని అమలుచేయకపోవడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటి వరకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రావాల్సిన బెనిఫిట్స్ రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు రహిత వైద్యాన్ని వెంటనే అమలుచేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మోహన్‌రావు, ఆంజనేయులు, జెల్లా పుల్లయ్య, సుధాకర్, శేషారెడ్డి, విద్య, టి.రమేష్, భిక్షం, రామలింగం, గోపాల్‌రెడ్డి, అలీ, సత్తయ్య, అఫ్జల్, ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత

గట్టుప్పల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యో తి): గట్టుప్పల మం డల పరిధిలోని వెల్మకన్నె గ్రా మానికి చెందిన ని రుపేద కుటుంబానికి చెందిన భీమనపల్లి యాదయ్య కుమార్తె కావ్య నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 393వ ర్యాంకు సాధించింది. ఎంబీబీఎస్ చదవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. విషయం తెలుసుకున్న తేరట్‌పల్లి తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు వీరమళ్ల శ్రీశైలం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఎంబీబీఎస్ చదివేందుకు కావ్యకు తన వంతుగా ఆదివారం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదని, అలాంటి వారికి ప్రతీ ఒక్కరూ అండగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కావ్య కుటుంబసభ్యులు శ్రీశైలానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, నాయకులు రమణారెడ్డి, భీమనపల్లి లింగస్వామి, షేక్ నూర్ మహ్మద్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం ఆలయ ముఖ్య అర్చకుడు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాలంకరణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర, సారె, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జూనియర్ అసిస్టెంట్ కూనం ఉపేందర్‌రెడ్డి, అర్చకులు మహేష్, దామోదర్, ఫణి, శ్రీనివాసచారి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు
సహకరించడంలో ప్రభుత్వం వివక్ష

● డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు

నల్లగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులను 30 సంవత్సరాల పాటు ఉన్నత చదువులు చదివించి వారిని అన్ని రంగాలల్లో తీర్చిదిద్దిన డ్వాబ్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుండా వివక్ష చూపించిందని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి ఏపీసీబీ ఉపాధ్యక్షుడు పానుగోటి చొక్కారావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని, అదేవిధంగా నల్లగొండలోని దివ్యాంగుల పాఠశాలకు సహకరించి ఉంటే పాఠశాల మూసివేసి ఉండే అవసరం ఉండేది కాదన్నారు. ఆ జిల్లాలో దివ్యాంగుల పాఠశాలకు రూ.50 లక్షలు కేటాయించిందని, అదేవిధంగా డ్వాబ్ సంస్థకు కేటాయించి ఉంటే తాము దివ్యాంగులకు పెద్ద ఎత్తున సేవ చేసి ఉండేవారమన్నారు. తమ డ్వాబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లభించలేదన్నారు. తాము కూడా అనేక సార్లు అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉపాధ్యాయులను నియమించి స్కూల్‌ను ఆదుకోవాలని ప్రభుత్వాలను కోరినా తమ ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదన్నారు. దివ్యాంగులపై ప్రభుత్వానికి అంత చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వాలు తమ డ్వాబ్ సంస్థతో పాటు దివ్యాంగుల పాఠశాలకు సహకరించక పోగా తమను అవమానించే విధంగా వ్యవహరించడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఇకనైనా తమ సంస్థకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆయిల్‌పామ్
సాగుపై నీలినీడలు !

(5వ పేజీ తరువాయి)

అధికారులు కరువయ్యారు. దీంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలంటే వెనుకంజ వేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

భూసార పరీక్షలు లేకుండానే..

తోటల సాగు చేసిన సమయంలో రైతులకు ఉద్యానశాఖ అధికారులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. తమ లక్ష్యంకోసం రైతులకు ఎలాంటి సలహాలు ఇవ్వకుండానే తోటలు పెట్టాలంటూ చెప్పడం తప్ప భూసార పరీక్షలు చేయించి, అందులో మొక్క పెడితే బతుకుతుందా? లేదా? అన్న విషయాన్ని రైతులకు వివరించడంలో రైతులు వైఫల్యం చెందుతున్నారు. చాలా మంది రైతులు నీటి వనరులు లేక, భూసార పరీక్షలు చేయకుండా అవగాహన లేకుండానే మొక్కలు పెట్టడంతో అవి చనిపోవడం, లేదంటే ఎదగడం లేకుండా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రాయితీ వస్తున్నప్పటికీ రైతులు కూడా తమ వాటా కింద పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. దీని ప్రధాన కారణం ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతోపాటు ఉద్యానశాఖ అధికారులు కూడా కారణమని చెప్పవచ్చు. ప్రతినెల ఒక్కసారి అయిన తోటలను ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులు సందర్శించి ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా తెగుళ్లు సోకితే వాటికి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించే వారే కరవయ్యారు. కంపెనీ ప్రతినిధులు సైతం ఉద్యానశాఖ అధికారులతో ఏరోజు కూడా సమన్వయ సమావేశాలు నిర్వహించ లేదు. దీంతోనే జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగుపై గందరగోళ పరిస్థితి నెలకొంది.

అధికారులు, కంపెనీ ప్రతినిధులపై ప్రభుత్వం సీరియస్

ఆయిల్‌పామ్ సాగుపై నిర్లక్ష్యం చేస్తున్న కంపెనీ ప్రతినిధులతోపాటు అధికారుల తీరుపై ప్రభుత్వం తీవ్రంగా మండిపడుతుంది. ఈ నెల 6వ తేదీన వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యాన అధికారులు, పామాయిల్ కంపెనీల ప్రతినిధులు, ఆయిల్ ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారం రోజుల్లో ఏదో ఒకటి తేల్చుకొని ప్రభుత్వం వద్దకు రావాలంటే కంపెనీ ప్రతినిధులకు హెచ్చరికలు జారీచేశారు. నిర్ధేశించిన సమయంలో లక్ష్యం పూర్తి చేయాలని, లేదంటే ప్రాజెక్టు నుంచి వైదొలగాలంటూ కంపెనీ ప్రతినిధులను మందలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మొక్కలను పంపిణీ చేస్తున్న కంపెనీలు కూడా ఈ సమీక్షకు వెళ్లాయి. నల్లగొండ జిల్లాలో మంత్రులు పర్యటించిన సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంకోసం నిర్ణయాన్ని ప్రకటించారు. ఇప్పటివరకు సదరు కంపెనీ భూమిని కూడా కొనుగోలు చేసింది. ఆయిల్‌పామ్ విస్తీర్ణం మందకొడిగా సాగడంతో ఫ్యాక్టరీ వస్తుందా? లేదా? అన్న సందేహాలు రైతాంగంలో వ్యక్తమవుతుంది. ఇప్పటికే అరకొరగా వస్తున్న ఆయిల్‌పామ్ గెలలను ఖమ్మం, అశ్వారావు పేట ప్రాంతాలకు, ఫ్యాక్టరీ ఉన్న దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్‌పామ్ సాగు మందకొడిగా ఉన్న నేపథ్యంలో నల్లగొండ జిల్లా ఉద్యానశాఖ అధికారిణిని ‘ఆంధ్రజ్యోతి’ ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం అయోమయంలో పడిందన్న విమర్శలు ఉన్నాయి.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు

● ఎమ్మెల్యే వేముల వీరేశం



కార్లపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం కాంటా వేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి రైతాంగం పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొర్లపహాడ్, చీకటిగూడెం, కొత్తపేట, భాగ్యనగర్, గుడివాడ, కాసనగోడు, బొప్పారం, ఇప్పలగూడెం గ్రామాల్లో వానాకాలం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం వల్ల రైతులకు దళారీల బెడద తప్పుతుందన్నారు. అధికారం పోయిందనే బాధలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం కొనుగోళ్లపై చెప్తున్న మాటలు, చేస్తున్న ఆరోపణలు నమ్మవద్దని ఆయన రైతులకు సూచించారు. ప్రభుత్వం రైతాంగం పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే రైతులు పండించిన ధాన్యమంతా మద్దతు ధరకు కొనుగోలు చేసేది తెలంగాణలో మాత్రమేనన్నారు. ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, తహసీల్దార్ యు.రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె. లతీఫ్, ఐకేపీ ఏపీఎం మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు మట్టి సాల్మన్, బొజ్జ సుందర్, జి.మాధవరెడ్డి, జి.ప్రభాకర్, కోట పుల్లయ్య, కుమ్మరి నాగయ్య, ఎడ్ల ప్రవీణ్, బయ్య అంజయ్య పాల్గొన్నారు.

మాదారంలో అ‘పూర్వ’సమ్మేళనం

30 సంవత్సరాల కలుసుకున్న పూర్వ విద్యార్థులు - సరదాగా గడిపిన



సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

శాలిగౌరారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత వారంతా కలిసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న సమయంలో మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకొని ఆత్మీయంగా పలకరించుకు న్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి నేడు వారు ఒకే వేదిక మీద కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వీరయ్య, నర్సిరెడ్డి, బిక్షయ్య, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెర్రిపోతుల కిరణ్‌కుమార్, తాడోజు ప్రవీణ్ కుమార్, ఇంద్రప్రసాద్, నోముల శ్రీను, రంగు వీరయ్య, పల్స యాదగిరి, ఆకుల కృష్ణ, అప్ప రవి, వీణ, జ్యోతి, అనిత, ఉమారాణి, శ్రీను, కొండల్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి




సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండరూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని, లేని మున్సిపల్ కార్మికుల బతుకులు జీవిస్తున్నారని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా అనేక సంవత్సరాలు పని చేస్తున్న కార్మికులకు శ్రమకు తగినవేతనం అమలు కావడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి, పని భద్రత కల్పించాలని, కార్మికులు మృతి చెందితే కనీస సౌకర్యాలు, ఇన్సూరెన్స్ లేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని, వారి హక్కులను సాధించే వరకు పోరాటం చేస్తుందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్‌లో ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించే యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా మహాసభ ప్రారంభానికి ముందు యూనియన్ జెండాను వీరారెడ్డి ఆవిష్కరించారు. సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చింతకాయల సంతోష్, శ్రీనివాస్ లక్ష్మమ్మ, పొట్ట తారమ్మ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయకార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, టౌన్ కన్వీనర్ అవుట రవీందర్, యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం : వెంకన్న

నల్లగొండరూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులను విస్మరిస్తుందని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండ వెంకన్న, చొగోని సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం మహాసభలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి గీత కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై 5 లక్షల కటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. కార్మికుల అభివృద్ధి కోసం రూ.5 వేల కోట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరతరాలుగా కల్లుగీత వృత్తి చేస్తూ ప్రభుత్వానికి వేలాది కోట్లు పన్నుల చెల్లించామని, కానీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గీత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. అతి ప్రమాదకరమైన కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికులందరికీ సేఫ్టీ కిట్లు అందించాలని, స్వయం ఉపాధి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. ప్రభుత్వ లిక్కర్ పాలసీ వల్ల రోజురోజుకు వృత్తి దెబ్బతింటుందని అన్నారు. ఈ సభలో పామునుగుళ్ల అచ్చాలు, గోపాలు, నర్సింహ, లింగస్వామి, గీత కార్మికులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 13 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	1,01,180	1,01,180
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	2018.50	1709.63
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.6942)	82,430	82,477

చికెన్ ధరలు | లైవ్ : రూ.139 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

దామన్న కృషితోనే గోదావరి జలాలు

- ఆస్తులమ్మి పార్టీని కాపాడిన వ్యక్తి దామన్న
- ఆ కుటుంబానికి అండగా ఉంటాం
- ఏ అవకాశమొచ్చినా సర్వోత్తమరెడ్డికి అవకాశమిస్తాం
- దామోదర్‌రెడ్డి సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



ఒక్కొక్కరు ఒక్కసారి ఎన్నికైతేనే ఆస్తులు కూడ బెట్టుకుంటున్నారు, అలాంటిది రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు మంత్రిగా ఉండి కూడా ఆస్తులు అమ్మి పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడుకున్న గొప్ప వ్యక్తి..
● సీఎం రేవంత్‌రెడ్డి

మోత్కూరు/తుంగతుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దామన్న కృషితోనే ఇక్కడికి గోదావరి జలాలు సాధ్యమయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా జరిగిన సంతాప సభలో పాల్గొని దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, హత్యాయత్నాలు ఎదుర్కొని నిలబడిన ధీశాలి దామోదర్‌రెడ్డి అన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడానికి, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమి కొట్టడానికి పోరాడి గోదావరి జలాలు సాధించారన్నారు. శ్రీరాం సాగర్ జలాలు తీసుకరావాలన్న ఆలోచన వచ్చిందే దామోదర్‌రెడ్డికి అన్నారు. వేలాది ఎకరాల భూమి విక్రయించి, జిల్లా ప్రజల కోసం ఖర్చు చేశారన్నారు. తుంగతుర్తి నియోజవర్గం ఎస్సీగా రిజర్వు కానంత వరకూ ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారని, తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయ్యాక పక్క నియోజకవర్గం సూర్యాపేటకు వెళ్లినా ఈ నియోజకవర్గంలో పార్టీని, కార్యకర్తలను కాపాడటానికి ఎంతో కృషి చేశారన్నారు. 1985 నల్లగొండ జిల్లాలో ఒకే ఒక్కడు దామోదర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి నల్లగొండ జిల్లాలో పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సుజాతనగర్, పాలేరు నియోజవర్గాల నుంచి దామోదర్‌రెడ్డి అన్న వెంకట్‌రెడ్డి గెలిచి అక్కడ పార్టీని, పార్టీ కార్యకర్తలను కాపాడారని చెప్పారు. దామోదర్‌రెడ్డి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటన్నారు. ఏ అవకాశమొచ్చినా సర్వోత్తమరెడ్డికి అవకాశమిస్తామన్నారు.



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

దామన్న కీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది 7



సంతాపసభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

యువతకు స్ఫూర్తిగా నిలిచారు

యువత రాజకీయాల్లోకి రావడానికి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్ఫూర్తిగా నిలిచారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 1985లో నల్లగొండ జిల్లాలో ఎవరూ గెలువలేని సందర్భంగా దామోదర్‌రెడ్డి విజ యం సాధించి పార్టీ జెండాను జిల్లాలో రెపరెపలాడించారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన తుంగతుర్తి నియోజకవర్గంతోపాటు, జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. యువత రాజకీయాల్లోకి రావడానికి ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఎన్నికల ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వెళుతున్నప్పుడు దామోదర్‌రెడ్డి తన వయస్సును కూడా లెక్కచేయకుండా తనవెంట నడిచారన్నారు. దామోదర్‌రెడ్డి ఆశయాలను తమ ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందన్నారు.

అంతరాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న నర్సిరెడ్డి

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతరాలు లేని విద్యా సమాజాన్ని నిర్మించుకోవాలని టీపీఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీపీఎస్‌వీ (తెలంగాణ పౌర స్పందన వేదిక) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ భవనలో ఏర్పాటు చేసిన 'విద్యలో అంతరాలు తొలగిపోయేదెట్లా?' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ చెప్పి న కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాధేశ్యామ్ మాట్లాడుతూ విద్యారంగంలో అసమానతలు ఉండడంతో విలువలు పతనమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. టీపీఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన కమి సమ్మేళనంలో కవులు, రచయితలు సాగర్ల సత్తయ్య, కృష్ణారెడ్డి, మూనాస వెంకట్, పగడాల నాగేందర్, పెరుమాళ్ల ఆనంద్, శ్యాంసుందర్, భూతం ముత్యాలు, బండారు శంకర్, హుస్సేన్ పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుపై నీలి నీడలు!

ఆయిల్‌పామ్ సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాగే కొనసాగితే నిర్ణీత వ్యవధిలో లక్ష్యం నెరవేరడం కష్టమేనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. రానున్న రోజుల్లో తెలంగాణను ఆయిల్‌పామ్ హబ్‌గా మార్చి దేశంలోనే రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలపాలని ప్రభుత్వం సంకల్పంచింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణాన్ని విస్తరిం పజేయాలన్న లక్ష్యానికి ఉమ్మడి జిల్లాలో పామాయిల్ కంపెనీలతో ఉద్యానశాఖ అధికారులు నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- నిర్ణీత వ్యవధిలో లక్ష్యం నెరవేరడం కష్టమే
- సహకరించని పామాయిల్ కంపెనీలు
- ఉద్యాన అధికారులు, కంపెనీల మధ్య సమన్వయలోపం
- సాగు విస్తీర్ణం పెరిగితేనే ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం
- మందకొడిగా సాగు విస్తీర్ణంపై మంత్రి తుమ్మల మండిపాటు

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా వచ్చే ఆదాయాన్ని వివరించి తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సి ఉంది. కానీ నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. వాస్తవానికి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సాగు ముందుగా ప్రారంభమైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మాత్రం రెండేళ్ల కిందనే ఈ తోటల సాగు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ కంపెనీల ప్రతినిధులకు ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ఉద్యానశాఖ అధికారులతో కలిసి పనిచేయని పరిస్థితులున్నాయి. మొక్కల పంపిణీ నుంచి మొదలుకొని వాటి పెంపకం వరకు రైతులకు ఉద్యానశాఖ అధికారులతో కలిసి కంపెనీ ప్రతినిధులు, వారి ఉద్యోగులు రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా కూడా కంపెనీల ప్రతినిధులు సాగు చేస్తున్న రైతులను కలిసిన దాఖలాల్లేవు. కంపెనీల ప్రతినిధుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేకుండా పోయింది. ఇక ఉద్యానశాఖ హెచ్‌వోలు సైతం అంటి ముట్టన్నట్లుగా ఉండటంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీనికితోడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎనిమిది మండలాలకు ఒకరి చొప్పున హెచ్‌వోలు ఉండటంతో ఆయిల్ పామ్ సాగు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

ఉమ్మడి జిల్లాలో లక్ష్యం నెరవేరేదెలా

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 20 వేలలోపు ఎకరాలకు మాత్రమే ఆయిల్‌పామ్ సాగు విస్తరించి ఉన్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాలో 10,700 ఎకరాలు సాగు కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 4వేలకు పైగా ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 4,500 ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు తెలిసింది. అయితే నల్లగొండ జిల్లాలో మొత్తం 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం కావాలని, ఇందులో ఈ ఏడాది చివరిలోగా మరో 6,500 ఎకరాల్లో సాగు చేయాలన్నా లక్ష్యాన్ని విధించారు. అంటే ఏడాదిలో జూన్ నాటికి మొత్తంగా 25వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ విస్తరణ అనేది అనుమానమే. అదేవిధంగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో కూడా ఆయిల్‌పామ్ సాగు మందకొడిగా సాగడం గమనార్హం. ఆయిల్‌పామ్ సాగు చేస్తే సంవత్సరానికి వచ్చే ఆదాయాన్ని రైతులకు వివరించడంతోపాటు పలు విధాలుగా వచ్చే లాభాలను రైతులకు తెలియజేస్తే తప్ప ఆయిల్‌పామ్ సాగు తోటల విస్తీర్ణం పెరిగేందుకు అవకాశాలులేవు. సాగు విస్తీర్ణం పెరగడం లేదన్న విషయం తెలిసినప్పటికీ మండలాలవారీగా, గ్రామాల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించే....

- మిగతా 8వ పేజీలో...

ప్రీ ప్రైమరీ బోధన అంతేనా?

● రెండు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని తరగతులు



6

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

● పట్నంబాట పట్టిన ప్రజలు



7

కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

అమరవీరుల ఆశయాలను సాధించాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు వీ.హనుమంతరావు



వల్లాలలో అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న హనుమంతరావు, పక్కన ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ దయాకర్

శాలిగౌరారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో 1948లో జాతీయ జెండా ఎగురవేసిన 10 మంది విద్యార్థులను రజాకారులు కాల్చి చంపారు. అమరవీరుల చరిత్రను తెలుసుకున్న హనుమంతరావు ఆయన సొంత ఖర్చులతో గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అమరవీరుల స్మారకార్థం స్థూపాన్ని నిర్మించారు. స్థూపావిష్కరణ సభలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 10 మంది అమరవీరుల కుటుంబాలకు రూ.5లక్షలను, ఒక్కొక్కరికి రూ.50వేలను ఆదివారం సాయంత్రం హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ అమరవీరులకు గుర్తుగా వల్లాలలో అమరవీరులకు గుర్తుగా అత్యున్నతమైన సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ శాసనసభ్యుడు గోనే ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఇతియాజ్ అహ్మద్, భూపతి వెంకన్న, దండ అశోక్‌రెడ్డి, మాదగోని రామలింగయ్య, నరిగె నరసింహ, నోముల జనార్ధన్, గుండ్లపల్లి సైదులు, వేముల గోపీనాథ్, బోడ అరుణ్ కుమార్, నోముల రవికుమార్, గుండ్లపల్లి శంకర్, నాగరాజు, నరిగె ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ 42శాతంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్‌గార్డెన్‌లో జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రాబాయి సంతాపసభలో అయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తుంటే కేంద్రం అమలు కాకుండా అడ్డుకుంటోందన్నారు. రిజర్వేషన్ చట్టబద్ధతకోసం రాష్ట్రం సుప్రీం కోర్టులో అప్పీల్ చేయడానికి సిద్ధమవుతోందని, అది సరిపోదని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పతులను భారతదేశానికి దిగుమతి చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల మన వ్యవసాయరంగానికి నష్టం కలుగుతుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం ధాన్యం కోతలు ప్రారంభం కానున్నందున ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వర్‌రావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాశం, కందాల ప్రమీల, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవి నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఏఐ తోడు

- పారదర్శకంగా ఇళ్ల మంజూరు, నిర్మాణాలు
- బిల్లుల చెల్లింపులకు ఏఐ టెక్నాలజీ



ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు, బిల్లుల చెల్లింపు వరకూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంత వరకు వినియోగించాలని గృహ నిర్మాణశాఖ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఏఐ ఆధారిత పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకతకోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించే సమయంలో బ్యాంకర్లు చేసిన తప్పిదాలవల్ల ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ఆర్థికసాయం పంపిణీలో గందరగోళం లేకుండా చర్యలు చేపట్టింది. ఆ ఆధార్ నెంబరు ఏ బ్యాంక్ ఖాతాతో అనుసంధానమై ఉందో ఆ బ్యాంకు ఖాతాలోకి ఆటోమెటిక్‌గా నిధులు జమ అవుతాయి. అలా జరిగేలా సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పూర్తి సమచారాన్ని ఆన్‌లైన్ తెలుసుకునేలా ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న వెబ్‌సైట్‌లో పలు మార్పులు చేసింది. లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల పురోగతి, బిల్లుల చెల్లింపుల స్థితిగతులను ఆన్‌లైన్ నేరుగా తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు తరుచూ కార్యాలయాలకు వెళ్లకుండా వెబ్‌సైట్‌లోనే సంబంధిత వివరాలు తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా లబ్ధిదారులు ఇళ్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో పొరపాటు జరిగితే లబ్ధిదారులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారాన్ని అందిస్తున్నారు. తద్వారా వారు బ్యాంకు ఖాతాలు, ఇళ్ల మంజూరు వివరాలను సరి చేసుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపులకు ఏఐ టెక్నాలజీ

ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరిగే సమయంలో లబ్ధిదారుల పేరును పరిశీలించేలా ఏఐ టెక్నాలజీ అప్‌డేట్ చేస్తున్నారు. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా ఆర్థిక సాయం ఖాతాలో జమ కాకుండా నిలిచిపోతోంది. లబ్ధిదారుల పేరు, ఆధార్ నెం బరు జత అయిన మరో వ్యక్తి పేరు ఒక్కటే అయినప్పుడు ఇంటిపేరుతో సరిపోల్చి చూస్తున్నారు. ఇంటిపేరు ఒకటే అయినప్పుడు ఇంటి నెంబరుతో సరిపోల్చి చూసేలా కొత్తగా అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో ఆర్థికసాయం మొత్తం వేరే వారి ఖాతాల్లో జమ కాకుండా అడ్డుకుంటుంది.

రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు కేంద్రం కుట్ర

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం సృష్టించి మోదీ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందాలని భావిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రభాయి సంతాపసభలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎండీ అబ్బాస్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తుపెంచి బనకచర్లను నిర్మించడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బనకచర్ల నిర్మాణానికి తెలంగాణ అడ్డుకోవాలన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్ అమలు విషయంలో కేంద్రం ఆర్డినెన్స్, బిల్లు, జీవో రద్దుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఉన్న ఆరుగురు బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రంలో బీసీ అనుకూలంగా మాట్లాడుతూ దిల్లీలో వ్యతిరేకిస్తున్నారన్నారు. బీసీ బిల్లుకు కేంద్రం అడ్డుపడుతున్నందున తెలంగాణ బీజేపీ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. బీసీ బిల్లు అమలుకోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాన్ని కేంద్రానికి పంపాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ కుట్రకు పాల్పడుతున్న బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకోసం జరిగే ఉద్యమానికి సీపీఎం మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల, సయ్యద్ హసం తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి

6

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



కార్మికుల సంక్షేమానికి 'నమస్తే'

పట్టణాల్లో ప్రత్యేక పథకం అమలుకు చర్యలు



హాలియా మునిసిపాలిటీ కేంద్రంలో నమస్తే పథకానికి పేర్లు నమోదు చేయించుకుంటున్న కార్మికులు

వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన పథకం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టమ్ (నమస్తే) సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పథకాన్ని దేశంలోని అన్ని పట్టణాలలో అమలు చేస్తున్నారు. మునిసిపాలిటీల పరిధిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు వృత్తి పరమైన శిక్షణనివ్వడంతో పాటు వారికి భద్రతతో కూడిన గౌరవ మర్యాదలు అందించడమే ఈ పథకం ఉద్దేశ్యం.

– (మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి)

పురపాలికల్లోని పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహించే కార్మికుల (చేతులతో మురుగు తొలగించే వారు) భద్రతకు రూపొందించన పథకం నమస్తే. ఈ పథకం ద్వారా మూత్రశాలలు, మరుగుదొడ్లు, డ్రైనేజీల్లో వ్యర్థాలు తొలగించే కార్మికులకు సాయం అందిస్తారు. ఆయా విభాగాల్లో సేవలందించే వారికి గుర్తించి వైద్య, బీమా సదుపాయాలు కల్పించడం, వారి పిల్లల చదువుకు ఆర్థికసాయం చేయడంతో పాటు అరుపదుల వయసు దాటిన కార్మికులకు ప్రతీ నెలా రూ. 3వేలు అందించనున్నారు. అంతేకాక వారు విధుల నిర్వహణ కోసం కొనుగోలు చేసే వాహనాలపై ప్రత్యేక సబ్సిడీ అందించే విధంగా పథకాన్ని రూపకల్పన చేశారు. ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంపై దృష్టి సారించారు.

వీరు కూడా..

పట్టణాల్లో చిత్తు కాగితాలు, ఇనుము, ప్లాస్టిక్ తదితర సామగ్రి, చెత్తను సేకరిస్తూ జీవితం గడిపే వారికి కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం ఫలాలను అందిస్తుంది. ఆయా పనులను వృత్తిగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఆర్థిక, సామాజిక పరమైన భద్రత కల్పించేందుకు జాతీయ యాంత్రిక పారిశుధ్య పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక యాప్ ద్వారా పేర్ల నమోదు

కార్మికుల భద్రత, క్షేమం కోసం ఏర్పాటు చేసిన పథకానికి అర్హులైన కార్మికుల వివరాలను మునిసిపల్ ఉద్యోగులు 'నమస్తే' యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆయా పనులు చేసుకుంటూ జీవనం చేసే వారిని గుర్తించి, వారి ఇళ్ల వద్దకే వెళ్లి పేర్లు నమోదు చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రపరుస్తూ, డ్రైనేజీల్లో వ్యర్థాలు తొలగించే వారిని ఎంపిక చేసి నమస్తేలో చోటు కల్పిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అలాంటి వారికి శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు శానిటరీ అధికారులు తెలిపారు.

టఫ్‌గా కాకుండా స్మార్ట్‌గా...

యాంత్రీకరణ నేపథ్యంలో అన్ని రంగాల్లో మార్పులు వస్తున్నాయి. డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్, టాయ్‌లెట్ల నిర్వహణలోనే మిషనరీ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆయా పనులను టఫ్‌గా కాకుండా స్మార్ట్‌గా నిర్వహిస్తున్నారు. అయితే ఆయా మార్పులు, యంత్రాల వినియోగంపై కార్మికులకు అవగాహన రావడం లేదు. అందుకే నమస్తే పథకం ద్వారా కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు ఆర్థికసాయం అందించడం, యంత్రాలు, వాహనాల కొనుగోలుకు అవసరమైన రుణాలు సబ్సిడీలో అందించనున్నారు. ఇందుకు గాను మిర్యాలగూడతో పాటు హాలియా, సాగర్ మునిసిపాలిటీలలో సర్వే నిర్వహిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం



కార్మికుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు ఆరోగ్య భద్రతను అందించేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే నమస్తే. పట్టణ పరిధిలో ఈ పథకానికి అర్హులైన వారిని గుర్తిస్తున్నాం. ఇప్పటికి 150 మందిని ఎంపిక చేసి అందులో 78 మంది పేర్లు నమోదు చేశాం. మిగతా వారి వృత్తి, జీవనవిధానం తదితర అంశాలను సేకరించి యాప్‌లో పొందుపరుస్తాం.

– గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల 1994-97 డిగ్రీ బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 28 సంవత్సరాల క్రితం కళాశాలలో చదివిన 40 మంది విద్యార్థులు ఆత్మీయంగా ఒకరికి ఒకరు కలుసుకొని పలకరించుకున్నారు. తాము చదివిన కళాశాల గదులలో కూర్చొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేసి ఏ రంగంలో స్థిరపడ్డారు, పిల్లల చదువులు, వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనంలో విద్యా బుద్ధులు నేర్పిన అధ్యాపకులు డాక్టర్ అరుణచలం, డాక్టర్ నిర్మల్‌రెడ్డి, అన్సారలి, చంద్రుడు, ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పురుషోత్తం, పసుపులేటి శివప్రసాద్, బికుమళ్ల రామకృష్ణ, సాంబశివ, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, పాండు, చంద్రకళ, కళావతి, జయమ్మ, వరలక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా ఎంపికైన శ్రీకాంత్‌కు ఘనసన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

గుర్రంపోడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన గుర్రంపోడు మండలంలోని జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలకేంద్రంలోని శ్రీకాంత్ చదివిననవోదయ ఉన్నత పాఠశాల యాజమాన్యం సన్మానించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ఎంతో పట్టుదలతో శ్రమించి డీఎస్పీగా ఎంపిక కావడం తమ పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తాను సాధించిన ఈ విజయంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వద్దిరెడ్డి నరసింహరెడ్డి, రావుల వెంకటనారాయణగౌడ్, పన్నాల గోపాల్, సత్యం, జహంగీర్, శ్రీనివాస్, స్వప్న, నేహ, చంద్రమోహన్, పూర్వ విద్యార్థులు నారాయణ, రొండి ఏడుకొండలు, రవి, శ్రీధర్, కొండలు, శివ వెంకటేష్, శ్రీనివాస్, ప్రకాష్, చంద్రకళ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సరఫరా చేయాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని సకాలంలో సరఫరా చేయాలని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నెలా మెదటి వారంలో లబ్ధిదారులకు బియ్యం అందించాల్సి ఉండగా, రెండు వారాలు కావస్తున్నా నియోజకవర్గంలోని యాభై శాతం దుకాణాలకు బియ్యం సరఫరా చేయకపోవడం ఏమిటో కాంట్రాక్టర్లకే తెలియాలన్నారు. బియ్యం సరఫరాపై సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, వెనువెంటనే బియ్యాన్ని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో లబ్ధిదారులతో కలిసి గోదాం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చిలకల వెంకన్న, చావల వెంకటేశ్వర్లు, ఏచూరి అనంతరాములు, నూకంగు కాశయ్య, దాసోజు కాంతాచారి, లింగానాయక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్



గుడిపల్లి (పెద్దఅడిశర్లపల్లి), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ మోసం చేసి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గుడిపల్లి మండలంలోని ఘనపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నీలంనగర్‌కు చెందిన కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి పరమేష, కటికనేని మాధవరావుతో పాటు వివిధ గ్రామాల నుంచి 150 కుటుంబాల కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలైనా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలు ఆందోళన బాట పట్టాయని అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెంది స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి, నాయకులు మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ, నిమ్మల విష్ణువర్ధన్‌రెడ్డి, మాద సుధాకర్ గౌడ్, బోడ్డుపల్లి మహేందర్, రాయనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గోలి గిరి, ఎర్ర యాదగిరి, కస్తూరి యాదగిరి, అద్దంకి దానబాబు, షైనం లింగయ్య, నాయిని రాఘవేంద్రరావు, సత్తయ్య, రాంబాబు, లాజర్, అనిల్, వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

చింతపల్లి: కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో ఆదివారం ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఉజ్జిని విద్యాసాగర్‌రావు, కొండూరు శ్రీనివాస్, కాశగోని వెంకటయ్య, బాదేపల్లి పులిరాజ్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, జగదీష్, నరేష్, రామకృష్ణ, శ్రీశైలం, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్థికసహాయం అందజేత

త్రిపురారం అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంపసాగర్ గ్రామానికి చెందిన కామాళ్ల నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొండ భాస్కర్ ఆదివారం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యనమల్ల వెంకన్న, లక్ష్మయ్య, వెంకటయ్య, సంద్రాల లింగయ్య, అవిరెండ్ల షైనయ్య, ఆవుల జానయ్య, వల్లపు వెంకటయ్య, నల్లబోతు కృష్ణయ్య, వరంగి నాగరాజు, యల్లావుల మహేష్, మేదరి శ్రీను, సైదులు, మామిడి వెంకన్న, షైనం నాగేందర్, సిగపట్ల రమేష్, అదిముళ్ళ కోటయ్య, సతీష్ పాల్గొన్నారు.

డ్రాలో గౌడ కులస్థులే పాల్గొనాలి

అడవిదేవులపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గౌడ్స్‌కు రిజర్వ్ అయిన వైన్స్ షాపుల్లో గౌడ కులస్థులు మాత్రమే లక్కీడ్రాలో పాల్గొనాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలో గౌడ కులస్థులకు రిజర్వ్ చేసిన వైన్స్‌లలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళారులు, పెట్టుబడిదారులు గౌడ కులస్థులకు ఆశ చూపిస్తున్నారని, రిజర్వ్ అయిన వైన్స్‌ల కోసం వేరే వారికి బినామీలుగా ఉండవద్దన్నారు. అలా బినామీలుగా ఉన్న వైన్స్‌లను రద్దు చేయించి చట్టపరంగా తిరిగి లక్కీ డ్రా నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద శ్రీనివాస్‌గౌడ్, తిరుపతయ్య, గాలి వెంకటేశ్వర్లు, ముత్యాలు, మ ట్టయ్య, రాంబాబు, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల నిలిపివేతకు వ్యతిరేకంగా నిరసన

మిర్యాలగూడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దామాషా పద్ధతిన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ మారం శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ల నిలిపివేతకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయకుండా నిలిపివేయడంపై బీసీ వర్గాల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతుందని అన్నారు. రాజ్యాంగపరంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించేంత వరకు జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిరుమలగిరి అశోక్, కోలా సైదులు, మురళి, జయరాజ్, నాగభూషణం, గుడిపాటి కోటయ్య, భాస్కర్, నేతి సద్యనారాయణ, తోట వెంకటేశ్వర్లు, పాండురంగయ్య, సైదాచారీ, సైదులు గౌడ్, కాశయ్య యాదవ్, హరి కిషన్, సైదులు. బిక్షం, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కిసాన్‌యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

లక్‌పతినాయక్, ఏవో, చందంపేట



మండలంలోని రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చందంపేట ఏవో లక్‌పతినాయక్ సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలో పంటల వివరాల గురించి ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(చందంపేట, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పత్తికి ప్రస్తుత మద్దతు ధర ఎంత ఉంది, సీసీ కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

ఏవో: ప్రస్తుతం పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.8,110గా నిర్ణయించింది. మరో వారం రోజుల్లో సీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో యూరియా కొరత ఉందా?

ఏవో: చందంపేట మండలంలో సాగునీటి సౌకర్యం తక్కువగా ఉన్నందున యూరియా కొరతలేదు. యూరియా కొరత ఉన్నచోట అందరికీ యూరియా సరఫరా చేశాం.

ఆంధ్రజ్యోతి: కపాస్ కిసాన్ యాప్‌లో ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలా?

ఏవో: తప్పనిసరిగా ప్రతి ఒక్క రైతు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పంట వివరాలను, తమ వద్ద నిల్వ ఉన్న పత్తి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే పత్తిని సీసీ కేంద్రానికి ఎప్పుడు తీసుకురావాలో కూడా యాప్ తెలుపుతుంది. ఈ యాప్‌పై మండలంలోని ఏఈవోలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: రబీలో రైతులు ఏఏ పంటలు వేసుకోవాలి?

ఏవో: ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో రబీ సీజన్‌లో వేరుశనగ వేసే రైతులు అక్టోబరు చివరివారం లేదా నవంబరు చివరివారం నుంచి వేరుశనగ పంటలు వేసుకోవాలి.

ఆయిల్‌పామ్ సాగుపై నీలినీడలు!

(5వ పేజీ తరువాయి)

అధికారులు కరువయ్యారు. దీంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలంటే వెనుకంజ వేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

భూసార పరీక్షలు లేకుండానే..

తోటల సాగు చేసిన సమయంలో రైతులకు ఉద్యానశాఖ అధికారులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. తమ లక్ష్యంకోసం రైతులకు ఎలాంటి సలహాలు ఇవ్వకుండానే తోటలు పెట్టాలంటూ చెప్పడం తప్ప భూసార పరీక్షలు చేయించి, అందులో మొక్క పెడితే బతుకుతుందా? లేదా? అన్న విషయాన్ని రైతులకు వివరించడంలో రైతులు వైఫల్యం చెందుతున్నారు. చాలా మంది రైతులు నీటి వనరులు లేక, భూసార పరీక్షలు చేయకుండా అవగాహన లేకుండానే మొక్కలు పెట్టడంతో అవి చనిపోవడం, లేదంటే ఎదగడం లేకుండా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రాయితీ వస్తున్నప్పటికీ రైతులు కూడా తమ వాటా కింద పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. దీనికి ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతో పాటు ఉద్యానశాఖ అధికారులు కూడా కారణమని చెప్పవచ్చు. ప్రతినెల ఒక్కసారి అయిన తోటలను ఆయి ల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతో పాటు అధికారులు సందర్శించి ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా తెగుళ్లు సోకితే వాటికి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించే వారే కరవయ్యారు. కంపెనీ ప్రతినిధులు సైతం ఉద్యానశాఖ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించ లేదు. దీంతోనే జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగుపై గందరగోళ పరిస్థితి నెలకొంది.

అధికారులు, కంపెనీ ప్రతినిధులపై సీరియస్

ఆయిల్‌పామ్ సాగుపై నిర్లక్ష్యం చేస్తున్న కంపెనీ ప్రతినిధులతోపాటు అధికారుల తీరుపై ప్రభుత్వం తీవ్రంగా మండిపడుతుంది. ఈ నెల 6వ తేదీన వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యాన అధికారులు, పామాయిల్ కంపెనీల ప్రతినిధులు, ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారం రోజుల్లో ఏదో ఒకటి తేల్చుకొని ప్రభుత్వం వద్దకు రావాలంటే కంపెనీ ప్రతినిధులకు హెచ్చరికలు జారీచేశారు. నిర్దేశించిన సమయంలో లక్ష్యం పూర్తి చేయాలని, లేదంటే ప్రాజెక్టు నుంచి వైదొలగాలంటూ కంపెనీ ప్రతినిధులను మందలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మొక్కలను పంపిణీ చేస్తున్న కంపెనీలు కూడా ఈ సమీక్షకు వెళ్లాయి. నల్లగొండ జిల్లాలో మంత్రులు పర్యటించిన సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంకోసం నిర్ణయాన్ని ప్రకటించారు. ఇప్పటివరకు సదరు కంపెనీ భూమిని కూడా కొనుగోలు చేసింది. ఆయిల్‌పామ్ విస్తీర్ణం మందకొడిగా సాగడంతో ఫ్యాక్టరీ వస్తుందా? లేదా? అన్న సందేహాలు రైతాంగంలో వ్యక్తమవుతుంది. ఇప్పటికే అరకొరగా వస్తున్న ఆయిల్‌పామ్ గెలలను ఖమ్మం, అశ్వారావు పేట ప్రాంతాలకు, ఫ్యాక్టరీ ఉన్న దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్‌పామ్ సాగు మందకొడిగా ఉన్న నేపథ్యంలో నల్లగొండ జిల్లా ఉద్యానశాఖ అధికారిణిని 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం అయోమయంలో పడిందన్న విమర్శలున్నాయి.